

# చలువ రాయి

వడలి రాధాకృష్ణ



**నాన్నకు**

**బాగున్నారా.. అమ్మ ఎలా ఉంది?**

**మీ ఆరోగ్యం బాగుంది కదూ! జాగ్రత్తగా కాపాడుకోండి. పీరియాడికల్ మెడికల్ చెకప్‌కి మరల ఎప్పుడు వస్తున్నారు. ఈసారి అమ్మను వెంటబెట్టుకు రండి. కావ్య స్కూలుకి వెళుతోంది. రమ్యకి నడక కొంచెం కొంచెం వస్తోంది. దానికి పాకడం మటుకు బాగా వచ్చే సింది. అదృష్టంకొద్దీ మంచి ఆయా దొరికింది. ఆ పసి పిల్ల బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తోంది ఆమె. అభ్యతరం అనుకోక బోతే మీరు కొంత కాలం వచ్చి హైదరాబాద్‌లో ఉంటే నాకు అంతకు మించిన ఆనందం మరొకటి లేదు. అమ్మకోసం ప్రాధేయపడ్డానని చెప్పండి. ఆవిడ మనసు కరుతుందా? కరగాలనే ఆ ఏడు కొండలవాణ్ణి కోరుతున్నాను. మందులు పంపమంటారా? వెంటనే తెలియజేయండి.**

**- బదిరీ**

కొడుకు ఉత్తరాన్ని మరోసారి చదువు కున్నాడు రామబ్రహ్మం. మనసు విచలిత మైంది. కరడుగట్టిన హృదయం మూగగా నవ్వింది. ఆ నవ్వుకి శబ్దం లేదు. భావం లేదు. మనసుకు తేలికతనం లేదు. ఎవరో రంపంతో కఠినమైన శిలను కోస్తూన్న అనుభూతి.

కానీ దేనికీ కొరుకుడు పడని బండరాయి తాను.

వీధి వాకిలి. వాకిట్లోని తూగుటుయ్యాల. తన మనసు ఊహల్లాగే అదీ అస్థిరంగా ఉంది. గాలిలోని ఆధారంతో అటూ ఇటూ ఊగుతోంది. నడి వీధి దీపం. సుడిగాలికి ఊగిసలాడుతూన్న అనుభూతి నెలకొంది రామ బ్రహ్మంలో. కన్న కొడుకు అన్న పదాన్ని మరిచిపోయిన మనిషి. రక్త సంబంధాన్ని ఛిద్రం చేసిన మనిషి. ఏటి ప్రవాహానికి ఎదురీదే మనిషి. మనిషితనాన్ని మట్టిలో పాతేస్తూన్న మనిషి తను. కొడుకు ఎన్నిసార్లు తమ కోసం ఆర్తిగా అర్థించాడు. కానీ దురహంకారపు కఠిన

కోరలతో కాటేసి కసితీరా కాలదన్నుకుంటున్నారు.

"ఆ పసిపిల్లలు దిక్కులేని వాళ్ళయి పోయారు" అయితే తమకేం.. కానిపని చేసి కన్నది వాళ్ళు. ఎవరు ఎలా ఉంటే తమకేం..' ఆలోచిస్తే తమకంతో గుండె బరువెక్కినట్లయింది.

"వాడు ఈసారి చేజారిపోకుండా చూడండి" కాఫీ అందిస్తూ అంటూన్న భార్య కౌసల్య మాట సలహాలా లేదు. ఓ డిమాండ్‌లా ఉంది.

"మా అన్నయ్య అత్తగారి తరపువాళ్ళంతా మంచివాళ్ళు. ఒదిన పుట్టింటివాళ్ళది సాంప్రదాయ కుటుంబం. వాళ్ల అమ్మాయి సరళని బదరీకి చేసుకుంటే..." అంతకన్నా కావాల్సింది ఇంకేముంటుంది అనిపించింది రామబ్రహ్మానికి ఆ క్షణంలో. ఎటూ పాలుపోవడం లేదు ఆయనకి.

అస్థిరమైన ఆలోచనలు వెక్కిరించి వెర్రి వాణ్ణి చేస్తున్నాయి.

"ఇదే మంచి సమయం. కాస్త సంయమనంతో మంచిగా వాడి బుర్రకెక్కేటట్లు చెప్పండి"

"ఆ పని నువ్వే చేస్తే బాగుంటుందనుకుంటా" అన్నాడు ఆసక్తిగా ఆమె ముఖంలోకి చూస్తూ.

కొడుకుని ఎలాగైనా దారికి తెచ్చుకోవాలన్న దృఢ సంకల్పం తాలూకు ఛాయలు కనిపిస్తున్నాయి ఆమె ముఖంలో.

"బాగుంది ఈ మధ్య నా కొడుకు నా కొడుకంటూ వెనకేసుకొస్తున్నారుగా. మీరు చెబితే విననివాడు నా మాట ఏం వింటాడు?"

"చెప్పి చూస్తాను. మరి మనవరాళ్ళ సంగతి ఆలోచించావా?"

"వాడికి పిల్లలు.. మనకు మనవరాళ్ళు. కులం తక్కువదానికి కన్నవాళ్ళు, మనకేం సంబంధం. ఏ అనాథ ఆశ్రమంలోనో చేర్పించేయండి" ఆవిడ మాటల్లో హేళన, ద్వేషం, అసహనం కనిపిస్తున్నాయి.

మరోసారి ఆమె వైపు పరికించాడు. తీక్షణమైన కౌసల్య ముఖంలో ఎంతో దృఢత్వం చూస్తున్నాడు.

కౌసల్య గురించి రామబ్రహ్మానికి బాగానే తెలుసు. తమ ముప్ఫై ఐదు సంవత్సరాల వైవాహిక జీవితంలో ఎప్పుడూ తన మాటే పైచేయిగా ఉండాలని భార్య ఉద్దేశాలకి ఎప్పుడూ ఎదురు చెప్పలేదు తాను. చివరికి

## ప్రశ్న



**నేల తల్లి**
**కళ్ళు తుడిచే రైతే**
**కంట తడిపెడితే**
**పొంగలి ఎవరు చేస్తారు?**
**గోమాత**
**నిస్సత్తువుగా**
**నిర్జీవ బ్రతుకు గడుపుతుంటే**
**గొబ్బెమ్మలెలా వస్తాయి?**
**తెలుగు పడుచు**
**తెలుగు జాతి**
**విదేశ సంస్కృతి ఆకర్షిస్తే**
**రంగువల్లుల హరివిల్లులెలా**
**వస్తాయి?**

**- గుడిమెట్ల గోపాలకృష్ణ**

ఒక్కగానొక్క కొడుక్కి **బదరీ** అని పేరు పెట్టుకోవడంలో కూడా కౌసల్య మాటే నెగ్గింది.

నెగ్గింది అనడంకన్నా ఇంటి ఆడదాని మాటను నిలబెట్టాడంటే సమంజసంగా ఉంటుందేమో! ఇంటి విషయాలను, ఆఫీసు పనులను ఎప్పుడూ భార్యతో డిస్కస్ చేసి సలహాలు తీసుకునే రామబ్రహ్మానికి ఆమె మాటలు ఒట్టి మాటలు కాలేదు.

ఓ పెద్ద కంపెనీలో ఎనిమిది నెలల ఉద్యోగస్తునిగా కాలం వెళ్ళబుచ్చుతూన్న ఆయనకి కొడుకు చదువు సంధ్యలు తలకు మించిన భారమే అయింది ఆనాడు. కానీ కౌసల్య పట్టుదల కృషి కారణంగా బదరీ చదువులో బాగానే రాణించాడు. యం.యస్సీ. పాసై హైదరాబాద్‌లో మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు.

కన్న కొడుకు ఎదుగుదల వారి ఆశలకు జీవం పోసింది.

కోర్కెలకు చిగుళ్ళు తొడిగినట్లయింది.

"మా వాడు బంగారం" అని నలుగురితో చెప్పుకొని మురిసిపోయేది కౌసల్య.

"నాన్నా! బాంధవి మా ఆఫీసులో నా కొలీగ్ చక్కని అమ్మాయి. నాకు నచ్చింది. ఆమె మంచితనం నన్ను మనసు పారేసుకొనేలా చేసింది. మీరిద్దరూ ఒప్పుకుంటే ఆమె మీ కోడలవుతుంది" బదరీ మనసులోని మాట వారికి పిడుగులాంటి వార్తగా అనిపించింది.

"అదేమిట్రా కులము గోత్రము చూసుకోకుండా ఎవతెనో తీసుకొస్తే సరిపోతుందా?" కౌసల్య కొడుకును తీవ్ర స్వరంతో నిలదీసింది.

బదరీ మాటలు నమ్మలేకపోయాడు రామబ్రహ్మం. కొడుకు అంత పని చేస్తాడని ఊహించలేకపోయాడు.

"వాడు ప్రేమించి పెళ్ళి చేసుకుంటాను నాన్నా" అంటే నలుగురిలో తలెత్తుకు తిరగగలడా! ఇంటా వంటా లేని బుద్ధులు తన ఇంట్లో దాపురించేసరికి మింగుడు పడటం లేదు రామబ్రహ్మానికి.

"ఇటువంటి అప్రాచ్యపు పనులకు ఒడిగడతావట్రా" కోపంతో ఊగిపోయాడు.

ఇక కౌసల్య సంగతి సరేసరి. పచ్చి మంచి నీళ్ళు తాగలేదు. అన్నం ముట్టలేదు. కొడుకు నిర్వాకానికి ఉపవాసాలు చేసి, తిండి మాని క్రుంగి క్రుశించిపోయింది.

"నాన్నా మన్నించండి. బాంధవి నాకు ప్రియబాంధవి. ఆమె స్థానంలో మరొకామెను ఊహించుకోలేను. నన్ను తెలిసిన మీరు నా మనసును కూడా అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. ఇక కులగోత్రాలంటారా మంచితనం ఆమె కులం. ప్రేమాభిమానం తన గోత్రం. ఒక్కమాటలో చెప్పాలంటే బాంధవి లేని ఈ జీవితం అంతా ఎడారిమయం" ఎదిరించి బయటకు నడిచిన కన్న కొడుకును చూసి అవాక్కయిపోయాడు.

కొడుకు ప్రేమించి పెళ్ళి చేసుకోవడం. అదీ వచ్చింది కులం తక్కువది కావడం. విషయాన్ని విని తట్టుకోలేకపోవడం.. నిర్వాకాన్ని ఆకళింపు చేసుకోలేకపోవడం వంటివి వారిని మానసికంగా క్రుంగదీశాయనే చెప్పొచ్చు.

చివరికి కన్నకొడుకు అనే సున్నితమైన అంశాన్ని కూడా కాలదన్ని ప్రేగు బంధాన్ని తెంచుకునేదాకా తీసుకెళ్ళింది.

కుటుంబ గౌరవాన్ని కాలరాసినవాడు కొడుకైనా పెరట్లోని చెట్టు కొమ్మయినా పరాయి వాళ్ళ కిందే లెక్క. ఒకప్పుడు గుండెల మీద కూర్చుని ఆడుకున్న కొడుకు అమాంతం గుండెల మీద తన్ని దాటుకుపోతూంటే ఘనీభవించిన బాధల బరువుతో హృదయాలు

పాషాణంగా మారిపోయినట్లయింది వారికి.

"పరువు సాంప్రదాయాల్ని కాలదన్నిన మనిషికి ఇంట్లో స్థానం కష్టం" కౌసల్య అన్న మాటలకి అవాక్కయిపోయాడు బదరీ.

"అది కాదమ్మా" తల్లిని వారించబోయాడు.

"ఏది కాదురా! నా కొడుకు అని చెప్పు కునేందుకు వీల్లేకుండా చేశావ్" కను కొలను లోని నీటిపొర మెరుపు ఆమెలోని ఉద్వేగాన్ని తేటతెల్లం చేస్తోంది.

ఎరుపెక్కిన ఆ కంటి జీర కన్న ప్రేమను హరించి వేసినట్లయింది. నొచ్చుకోవడం బదరీ వంతయింది.

కన్నవాళ్ళు తనని కాదు పొమ్మంటే, మనసు పడ్డ బాంధవితోటి బాంధవ్యం క్రమంగా దృఢతరం కాసాగింది బదరీకి.

ఒక్కసారి ఎంతో ఆత్మీయమైన ఆ ఇంటి వాతావరణాన్ని చూసుకున్నాడు. అక్కడున్న ప్రతి చెట్టు ప్రతి మొక్క ప్రతి వస్తువు అన్నీ ఇప్పుడు తనను కానివాడుగా చూస్తున్నాయి.

అలవికాని దుఃఖంతో శాశ్వతంగా వైదొలిగాడు ఆ ప్రాంతం నుండి. కాలం తన వేగానికి తగ్గట్టుగా పరుగులు తీస్తోంది. సంవత్సరాలు ఊపునందుకొని ముందుకు కదిలి గతంగా రూపాంతరం చెందుతున్నాయి. తగిలిన మనసు గాయాలు ఎప్పటికైనా మానక పోతాయా అని ఆశపడ్డాడు బదరీ.

కానీ ఆ అగాధం అలగా నిలిచిపోయి ఉంది. కొడుకు ప్రేమ పేరుతో ఇంటర్‌కాస్ట్ పిల్లను పెళ్ళిచేసుకున్నాడన్న వాస్తవం ఏళ్ళు గడిచినా మదిలోంచి చెరిగిపోలేదు వారికి.

కౌసల్య అయితే మరీనూ! తనకు అసలు కొడుకే లేడన్నట్లు ప్రవర్తించేది. వాడి నిర్వాకానికి తల్లడిల్లి.. తలచుకొని తట్టుకోలేక మౌన రోదనతో రోజులు వెళ్ళబుచ్చే రామ బ్రహ్మం జీవచ్ఛవంలా బ్రతుకీడ్చడం తప్ప ఏమీ చేయలేని అసహాయస్థితికి చేరుకోవలసి వచ్చింది.

బాంధవితోటి దాంపత్యం అపురూపంగానే సాగుతున్నా, అమ్మా నాన్నలకు దూరమై జీవించడం జీర్ణించుకోలేకపోయిన బదరీ క్రమంగా పరిస్థితులకు అనుగుణంగా అలవాటు పడక తప్పలేదు.

బాంధవి పండంటి బిడ్డను కన్నది. అమితమైన ఆనందంతో తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పాడు బదరీ.

అటువైపు నుండి స్పందన లేదు. అత్తమామల తీరు తెలిసిన బాంధవికి ఆవిషయం పెద్దగా ఆశ్చర్యం కలగజేయలేదు.

అక్కడ హైదరాబాద్‌లో కొడుకు.. ఇక్కడ హనుమాన్ జంక్షన్‌లో తండ్రి .. చివరికి ఎవరికి వారే యమునాతీరే అయ్యారు. కొంత కాలం తర్వాత ఉన్నట్టుండి రామబ్రహ్మం తీవ్రమైన గుండెపోటుకు గురయ్యాడు. తల్లడిల్లి పోయింది కౌసల్య. ఉన్న ఊర్లో డాక్టర్ల సలహా మీద బెటర్ ట్రీట్‌మెంట్ కోసం ఆయన్ని హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌కి షిఫ్టు చేయవలసి వచ్చింది.

రామబ్రహ్మానికి గుండెపోటు వచ్చిందన్న విషయం కలతకు గురి చేసింది బదరీ బాంధవిలకి. వెంటనే తెలిసిన డాక్టర్లతో మాట్లాడి ఇన్‌టెన్సివ్ కేర్‌లో జాయిన్ చేశాడు. సమయానికి కొడుకు ఆదుకోవడంతోను, కోడలు సపర్యలతోను ప్రాణాపాయం నుండి బయటపడగలిగాడు.

తనకు గిట్టని కోడలు మావగారికి కేరియర్ తెచ్చిపెట్టడం, దగ్గరుండి తినిపించడం, సేవలు చేయడం లాంటివి రుచించని కౌసల్య హృదయం భగ్గుమంది. ఆమె వస్తోందంటే ఒళ్ళు జలదరించినట్లుండేది.

భార్య స్థితిని గమనించగలిగిన రామబ్రహ్మం ఆ క్షణంలో ఏమీ చేయలేక మిన్నకుండిపోయాడు.

చాలాకాలం తరువాత కొడుకు పెళ్ళాడిన అమ్మాయిని నిశితంగా పరిశీలించసాగాడు. అణకువగా అత్తమామల పట్ల విధేయత చూపిస్తోంది.

"ఈ యాపిల్ జ్యూస్ తీసుకోండి మావయ్యా! టైముకి ఆహారం పడకబోతే మళ్ళీ మొదటికొస్తుంది"

"....................."


"మీరు బొత్తిగా తిండి తగ్గించేశారు. మీ అబ్బాయి చెప్తుంటారు... నాన్నకు టమేటా పప్పు సాంబారు చాలా ఇష్టం" అని కేరియర్ లోని టమేటా పప్పు సాంబారులను వడ్డిస్తూ అంటూన్న ఆ పిల్లను చూస్తున్నాడు. మనసులో గూడు కట్టుకున్న ద్వేషం స్థానంలో ఒకింత ఆనందం కదలాడసాగింది మొదటిసారిగా ఆయనలో. కట్టు బొట్టులలోగానీ, నడవడికలో గానీ మంచి మార్కులే కొట్టేసింది కానీ రాయి లాంటి రామబ్రహ్మం ముందు అవన్నీ బలాదూరే అయ్యాయి.


కౌసల్య మట్టుకు ఈయన్ని ఏ కాకినాడో, మద్రాసో తీసుకుపోయుంటే బాగుండేది అని వాపోసాగింది.

"మరల పదిహేను రోజులలో పీరియాడికల్ చెకప్‌కి రావాల్సి ఉంటుంది. ఈ స్టేజ్‌లో ఎక్కువ ప్రయాణాలు చేయడం కూడా మంచిది కాదు. అపోలో హాస్పిటల్ నుండి డిశ్చార్జి అవుతున్నప్పుడు సూపరింటెండెంట్ మాటలు ఆలోచనలో పడేశాయి వారిని.

"డాక్టరుగారి మాటలు అక్షరాలా నిజం. ట్రైన్‌లో మరలా ఒత్తిడికి గురయ్యారంటే మరల తేరుకోవడం కష్టం. మనింటి దగ్గరుండి అవసరమైన ట్రీట్‌మెంట్ తీసుకుంటే అన్ని విధాలా మంచిది."

"అవును మావయ్యా! మన ఇంట్లో అన్ని సౌకర్యాలున్నాయి. దేనికీ ఇబ్బంది ఉండదు. అత్తగారు మీరు వచ్చి ఉండొచ్చు."





"సరే మీ ఇష్టంరా! ఆయన్ని జాగ్రత్తగా చూసుకోండి. టైముకు మందులు గుర్తు చేసి ఇవ్వాలి ఆయనకు. నాకు మాత్రం హనుమాన్ జంక్షన్‌లో హనుమత్ జయంతి కార్యక్రమాలు ఉన్నాయి. తప్పక వెళ్ళి తీరాలి."

తల్లి ,ఉద్దేశాన్ని గ్రహించిన బదరీ ఇక బలవంతం చేయలేదు.

మొదటిసారి కొడుకు ఇంటి గుమ్మం తొక్కిన రామబ్రహ్మానికి ఆ ఇంటి వాతావరణం అపూర్వ స్వాగం పలికినట్లనిపించింది. ఇంటి ముందు చక్కగా పాతిన పూలమొక్కలు, క్రమపద్ధతిలో పెంచుతున్న ఆకుపచ్చని లాన్ ఆహ్లాదాన్ని కలుగచేస్తున్నాయి. ఆ చిన్న ఇంట్లో ఎక్కడ ఉండవలసిన వస్తువు అక్కడ అందంగా అమర్చబడి ఉంది. అవి అన్నీ ఎంతగానో ఆకట్టుకున్నాయి రామబ్రహ్మాన్ని.

"ఇల్లు చూడు.. ఇల్లాలి వ్యక్తిత్వం చూడు" ఎవరో అన్న మాటలు గుర్తుకు వచ్చేసరికి పెదవులపై చిరునవ్వు గుబాళించింది ఆయనకు.

ఎదురుగా గోడకు పద్మావతీ శ్రీనివాసులు, ప్రక్కగా తమ ఫోటోలు నీట్‌గా తగిలించబడి ఉన్నాయి. ఆనందంతో ఉప్పొంగింది రామబ్రహ్మం హృదయం.

"మావయ్యా! మీ మనవరాలు కావ్య.. మూడో తరగది చదువుతోంది" దగ్గరకు పంపడానికి తటపటాయించింది బాంధవి. కొత్తగా కనబడుతూన్న ముసలి తాతగారిని చూసేసరికి బిక్కచూపులతో తల్లిని అల్లుకుపోయిందా చిన్నారి.

అది చూసిన రామబ్రహ్మం పెదాలపై అర్థం తెలియని చిరునవ్వు కదలాడింది. మొత్తానికి వాడిన వయసు.. బిగువును కోల్పోయిన బింకం.. ముసురుకొస్తూన్న వార్ధక్యం.. అందోళనకు గురి చేస్తూన్న అనారోగ్యం అన్నీ కలిసి మునుపటి మనిషిలా లేడాయన. కానీ కొడుకు చేసిన పని నిరంతరం వేధించి వేదనకు గురిచేస్తూనే ఉంది.

ఉన్న ఆ పదిహేను రోజులలో కనిపెట్టుకొని చేస్తూన్న కోడలి సేవలు.. ఆలనా పాలనా చూస్తూన్న కొడుకు దగ్గరకు తీయకపోయినా ఆటపాటలతో అలరిస్తూన్న చిన్నారి. అవన్నీ మీరు ఎవరో అన్న స్థాయి నుండి ఓ మెట్టు దిగేలా చేశాయి. అవసరమైన టెస్ట్‌లు చేయించడం, పలుమార్లు ఆసుపత్రికి తిరగడం జవానును కాపలాగా పెట్టడం అందరూ తనను పట్టించుకోవడం తన ఆరోగ్యం కోసం ప్రాకులాడటం అనేవి రామబ్రహ్మానికి తెలియని హాయిని కలుగజేసి ఆనందాన్ని పంచుతున్నాయి.

"కౌసల్య కూడా వచ్చి ఉంటే బాగుండేది" మనసులో అనుకున్నాడు. కానీ ఆమె పట్టు ఆమెది.

"కోడలు మరల నీళ్ళు పోసుకుంది" విషయం విని ఒక్కసారి రామబ్రహ్మం హృదయం పులకించింది. మనసులోని మనోభావాలు రెక్కలు విదుల్చుకొని ఆకాశపుటంచున ఎగురుతూన్న భావన ఆయనలో.

గూడు కట్టుకున్న ద్వేషం. కరడు కట్టుకున్న కాఠిన్యం. అతలాకుతలం చేసిన అహం.. ఆ క్షణాన అన్నీ ఏమైనట్లో? పొంగిపోర్లుతూన్న ఆనందపు అంచులలో తేలియాడుతూ ఇంటికి చేరుకున్నాడు.

తరువాత మూడు నాలుగుసార్లు మెడికల్ చెకప్‌కని వెళ్ళినప్పుడు కొడుకు ఇంటికెళ్ళి పలకరించి రావడం తన ప్రమేయం అంతగా లేకుండానే జరిగిపోయాయి.

❀ ❀ ❀

విధి ఎంత విచిత్రం. దానికి మరీ అంత క్రూరత్వమా! ఆనాడు బదరీ చేసిన ఫోన్ అయోమయంలో పడేసింది రామబ్రహ్మాన్ని. కౌసల్య అయితే విని చేతలుడిగి మౌనంగా ఉండిపోయిందంతే. బదరీ బాంధవ్యం ఛిద్రమైపోయింది. కోడలికి కాన్పు కష్టమైపోవడంతో రక్తస్రావం జరిగి కన్ను మూసిందట. కానీ పుట్టిన శిశువు క్షేమంగానే ఉందట. తల్లడిల్లిపోయాడు రామబ్రహ్మం. వెంటనే ఇద్దరూ హైదరాబాద్‌కి ప్రయాణమయ్యారు.

అక్కడ ఆ వాతావరణం.. నిర్జీవమై పడి ఉన్న బాంధవి.. ఎదురుగా పసికందులు.. వారిని గుండెలకత్తుకొని రోదిస్తూన్న బదరీ.. అన్నీ వారి పెద్దతనానికి పెను సవాలుగా మిగిలాయి.

కార్యక్రమాలు అన్నీ అయింతర్వాత తమ ఊరు వచ్చేశారు. పసిపిల్లల ఆలనా పాలనా.. పెంపకం వాళ్ళ బాగోగులు ఏమీ రామబ్రహ్మం కౌసల్య పెద్దగా పట్టించుకోలేదు. దానితో బాధ్యతలు బాంధవి తల్లిదండ్రులకు తప్పలేదు.

మరోసారి భార్య పిలుపు రామబ్రహ్మాన్ని ఈ లోకంలోకి వచ్చేలా చేసింది.

"నేను చెప్పింది ఏమైనా ఆలోచించారా లేదా! మీరిలా మీనమేషాలు లెక్కపెడితే ఎలా? ముందు చూపుతో సరళని వాడికిచ్చి పెళ్ళి చేయించేటట్లు వాడిని ఒప్పించండి.

"నా మేనకోడలు .. దగ్గర సంబంధం. అయినవాళ్ళం నెప్పటికైనా అతుక్కు

## తెలుగు నేర్చుకుంటున్న ముంబాయి భామలు!

అంకితకొచ్చిన చిరాకు తర్వాత ముంబాయి హీరోయిన్లు తెలుగు నేర్చుకోవడం మీద మక్కువ చూపుతున్నారట! తనతో ఆ పిల్ల హీరో డబుల్ మీనింగ్ మాటలు, బూతులు మాట్లాడాడంటూ అంకిత నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే! దాంతో ఇన్నాళ్ళూ సినిమా యూనిట్ తమని కూడా ఇదే చేసిందని ఈ బొమ్మలు ఇప్పుడు గ్రహించినట్లున్నారు. అందాలు ఆరబోసే అమ్మళ్ళకి తెలుగు పరిశ్రమ ఎప్పుడూ ఎర్ర తివాచీ పరుస్తుందన్న విషయాన్ని గ్రహించిన ఈ భామలు ఇక్కడ నిలదొక్కుకోవడానికి అర్జెంటుగా తెలుగు నేర్పే వారికోసం అన్వేషణలో పడ్డారు.

పోవాల్సిందే" కౌసల్య మాటలు నిశ్శబ్దంగా వింటున్నాడు రామబ్రహ్మం.

"ఆ ముదనష్టపు పిల్లల్ని ఏ అనాథశరణాలయంకో దారాదత్తం చేయండి.. ఏమిటి వినబడుతోందా?"

"................."

"నేను చెప్పింది జరిగి తీరాల్సిందే" సాగదీస్తూ విసురుగా లోపలికి నడిచింది కౌసల్య. భార్య మాటలు పెద్దగా బాధ కలిగించలేదు రామబ్రహ్మానికి. ఆమె తీరే అంత. స్వార్థం మనిషిలోని మానవత్వాన్ని హరించివేస్తుందట. అందుకే కౌసల్య మేనకోడల్ని కోడలుగా తీసుకు రావాలనుకుంటోంది. మామూలు పరిస్థితిలో అయితే తనకూ సమ్మతమే. కానీ పసిపిల్లలు. చూస్తూంటే ఎంత ముద్దుగొలుపుతున్నారు. వాళ్ళ అమ్మ సౌందర్యాన్ని, నాన్న పచ్చదనాన్ని రంగరించుకొని రెండు ఆణిముత్యాలుగా వెలుగుతున్నారు. తల్లి ఇక తమకు లేదని తెలిస్తే ఎంత తల్లడిల్లిపోతారో!

అసలు తానున్న పదిహేను రోజులలో బాంధవి తనని ఎంత అభిమానంగా చూసుకుంది. అడుగులకు మడుగులొత్తుతూ, భయభక్తులతో అగ్గగ్గలాడుతూ మావగారి హోదాను నిలబెట్టి తన ఆదరణకు పాత్రురాలయింది.

ఒక్కసారి తమ దూరపు బంధువు దుర్గయ్య మనసులో మెదిలాడు రామబ్రహ్మానికి. దుర్గయ్య రామబ్రహ్మాలది దగ్గర చుట్టరికం. దుర్గయ్య ఎప్పుడూ "బావా, చెల్లెమ్మా!" అంటూ వాళ్ళ ఇంటి దగ్గరే ఉంటూ ఉండేవాడు.

కొడుక్కి అక్కరకొస్తుందని అయినవాళ్ళ సంబంధం ఏరికోరి తెచ్చి చేసుకున్నాడు. తీరా పెళ్ళి అయిన పది నెలలకే వాళ్ళకీ వీళ్ళకీ మనస్పర్థలు వచ్చి చివరికి విడాకుల వరకు వెళ్ళింది.

కానీ తాను కొడుకు బాంధవిని చేసుకున్నాడన్న అక్కసుతో వెలివేశాడు. అయినా ఇద్దరూ అన్యోన్యంగా బ్రతికారే. ఆ చక్కని సంసారం చల్లని కుటుంబాన్ని తలచుకుంటే మనసు పులకిస్తోంది. కేవలం సామాజిక అంశాల ప్రాతిపదికన మనుషుల్ని విభజించి చూడటం ఎంతవరకు సహేతుకం? మనిషి జన్మ ఎత్తిన తాను, కొడుకు అనే విచక్షణ వదిలేసి బండరాయిలాంటి పాషాణపు వ్యక్తిత్వంతో ప్రవర్తించాడు ఆనాడు. కానీ ఆ చిన్న పిల్లల మనిషితనం ముందు పెద్దరికం కూలిపోతున్నట్లుంది.

లేకపోతే మరేమిటి? బాంధవి ఎంత మంచి పిల్ల. మొగుణ్ణి ఎంత అన్యోన్యంగా చూసుకుంటోంది. పిల్లల్ని ఎంత ప్రేమతో

## ఇవి బొత్తిగా మనశ్శాంతి లేని రోజులు



నాకు లేవు ఎటువంటి వ్యక్తిగత
సమస్యలు
అయినా ఇవి బొత్తిగా
మనశ్శాంతి లేని రోజులు!
ఉదయాన్నే విస్ఫోటన వివరాలు
శవాల గుట్టల ఫోటోలు
మోసుకొచ్చే వార్తా పత్రికలు!
ఛిద్రమైన చిన్నారుల దేహాల్ని
చిరుతరం నిరంతరం చూపి
సగౌరంగా తమ వ్యాపార
చాకచక్యాన్ని
చాటుకొనే ఇడియెట్ బాక్సులు!
ఇవి బొత్తిగా మనశ్శాంతి లేని
రోజులు!
అడవితో పాటు అగ్ర రాజ్యాన్ని కూడా
రక్తం రుచి చూసిన పులి
మాత్రమే
కాపాడగలదని
మళ్ళీ మళ్ళీ నమ్మే ప్రజలు!
అప్పిచ్చేవాడు వడ్డీ మాత్రమే తీసుకోక
అందరి బతుకుల్ని శాసిస్తూ విధించే
అంక్షలు
నాకు తెలియకుండా పరోక్షంగా
నన్ను ఆడిస్తున్న శక్తులు
నాకు అస్సలు లేవు వ్యక్తిగత
సమస్యలు
అయినా ఇవి బొత్తిగా మనశ్శాంతి
లేని రోజులు!
గోలీలు ఆడుకున్న రోజుల్లోని
ఆనందం
గ్లోబలైజేషన్ కాలంలో కూడా
ఉండాలను
కోవడం ఎంత అవివేకం!
మళ్ళీ చెబుతున్నాను
అస్సలు లేవు నాకు వ్యక్తిగత
సమస్యలు
ఉన్నవన్నీ ఆలోచనలు!
అవును ఆలోచనలే
అందుకే ఇవి బొత్తిగా
మనశ్శాంతి లేని రోజులు!

\- ఆనందరావ్ పట్నాయక్

పెంచుకుంటోంది. తానున్న కొద్ది రోజులు రాత్రి అనక పగలనక ఎంత భక్తితో, సేవ చేసింది. అటువంటి ఆమె పట్ల ద్వేష భావంతో వ్యవహరించడం ఎంతవరకు సబబు.

అంతటా ప్రేమను పంచి ప్రకృతిలో కలిసిపోయింది. కానీ కౌసల్య! ముత్యాల వంటి పిల్లల్ని ఆనాథలుగా మార్చి ఎక్కడో శరణాలయంలో పడేయమంటోంది. అది ఎంత పాపం!!

పోనీ సరళని ఇచ్చి బదరీకి రెండో వివాహం చేస్తే, ఆమె పిల్లల్ని ప్రేమగా పెంచగలదా? ముమ్మాటికీ పెంచదు.

ఆలోచిస్తూన్న రామబ్రహ్మం మెదడు రాటుదేలుతోంది. సంకుచితత్వాలకు అతీతంగా వ్యవహరించమని హృదయం నొక్కి చెబుతోంది. మనిషిలా మానవత్వాన్ని మేలుకొలపమని మనసు ఘోషిస్తోంది.

దగ్గరవారి పిల్లను కోడలిగా చేసుకోవాలనుంది తనకు. కులంకన్నా మానవకులం మిన్న. తన కులజాడ్యంకన్నా మనుమరాళ్ళ సంరక్షణ ముఖ్యం. సరళ ఆ పిల్లల్ని తీరువుగా పెంచుతుందా.. నెవ్వర్... యస్ బదరీని ఈ క్లిష్ట కాలంలో ఆదుకోవాలి. కూలిపోయిన వాడి జీవితాన్ని నిలబెట్టాలి. దానిని సరళతోనో.. మరో అమ్మాయితోనో కాదు.. అలా చేస్తే వాడూ, పిల్లలూ అన్యాయమైపోతారు. బాంధవి స్థానాన్ని ఆమె చెల్లెలితో భర్తీ చెయ్యాలి.

అవును బాంధవి చెల్లెలు ఒకామె పెళ్ళికి ఉందని తనకు తెలుసు. ఆమెను కోడలిగా తెచ్చుకోవడమే ఈ సమస్యకు నిజమైన పరిష్కారం. దానికి బదరీ ఒప్పుకుంటాడా? ఒప్పించగలనన్న నమ్మకం తనకుంది. మరి కౌసల్య? చరిత్రను పరిశీలిస్తే బండరాళ్ళు ఎప్పుడు కరిగాయి కనుక!

ఒకప్పుడు తాను చేసిన పొరబాటు ఇప్పుడు పునరావృతం కాబోవడం లేదు అన్న ఊహ కొండంత అండగా కనిపిస్తోంది ఆ క్షణంలో..ఇంత కాలానికి జీవితంలో ఒక మంచి నిర్ణయం తీసుకున్నానన్న తృప్తి కదలాడుతోంది రామబ్రహ్మంలో. ❋